మొక్కలు నాటి సంరక్షించాలి

కార్పొరేటర్ రావుల శేషగిరి



సుభాష్‌నగర్: ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజుల రామారం డివిజన్ మహాదేవపురంలో శుక్రవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



సుభాష్‌నగర్: అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, పెయింటింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీలో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జడ్పీహెచ్ఎస్ కొంపలి విద్యార్థులు ప్రథమ స్థానం, కొంపల్లి శ్రీచైతన్య 1 శాఖ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఈ నెల 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం నాడు బహుమతులు, సర్టిఫికెట్లు అందించనున్నారు. అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, వినయ్‌కుమార్ సాహు, వంశీ కృష్ణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల క్యాపిటల్ పనుల నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుండి 11.30 గంటల వరకు జయరాంనగర్, శ్రీకృష్ణనగర్, గణేష్ కాలనీ, జేకే నగర్, రుక్మిణి ఎస్టేట్స్, 11కేవీ సుచిత్ర ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుండి 3.30 గంటల వరకు సుచిత్ర ప్రధాన రోడ్డులోని షాపింగ్ మాల్స్, టీఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతంలో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అన్నారు. శుక్రవారం సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఎంటమాలజీ సిబ్బందితో కలిసి పలు ఇళ్లను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. చెత్త, చెదారాలను రిక్షాల్లో వేయాలని కోరారు. జీడిమెట్ల గ్రామంలో అసిస్టెంట్ ఎంటమాలజీ ఉమారాణి, సిబ్బందితో కలిసి పలు ఇళ్లల్లో 'యాంటీ లార్వా ఆపరేషన్' చేపట్టారు.

72 మందితో..

కాలనీలు, మురికివాడ ప్రాంతాల్లో వర్షాకాలంలో వచ్చే డెంగీ, మలేరియా వ్యాధులను అరికట్టేలా అధికారులు కృషి చేస్తున్నారు. ఎంటమాలజీ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి యాంటీ లార్వా ఆపరేషన్ ద్వారా నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో పిచికారీ చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఇందుకు ఒక్క డివిజన్‌కు 18 మంది సిబ్బందిని నియమించి మొత్తం నాలుగు డివిజన్లలో 72 మందితో ఇంటింటి సర్వే చేపట్టారు. ప్రతిరోజు ఒక కాలనీ ఎంచుకొని ఇద్దరు చొప్పున ఈ కార్యక్రమానికి ప్రణాళికలు రూపొందించారు. రానున్న రెండు నెలల్లో వర్షాలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఎంటమాలజీ సిబ్బందితో ఈ కార్యక్రమం కొనసాగుతుందని సీనియర్ ఎంటమాలజీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇందులో సిబ్బంది తమకు సూచించిన కాలనీలో విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



జీడిమెట్ల గ్రామంలో ఎంటమాలజీ సిబ్బందితో ఉప కమిషనర్ నరసింహ

నీటి తొలగింపునకు చర్యలు

కుత్బుల్లాపూర్ : సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల పైకి చేరిన నీటిని సర్కిల్ సిబ్బందితోపాటు హైడ్రా సిబ్బంది తొలగింపునకు చర్యలు చేపట్టారు. శుక్రవారం 'రహదారులు బురదమయం' అన్న కథనంతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉప కమిషనర్ నరసింహ స్పందించి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జీడిమెట్ల, రంగారెడ్డి నగర్, సుభాష్ నగర్, కుత్బుల్లాపూర్ డివిజన్ల పరిధిలో పలు ప్రధాన రహదారుల వెంట వర్షపు నీరు నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. వెంటనే హైడ్రా, మున్సిపల్ సిబ్బందితో కాలువలు తవ్వించి నీటిని పక్కకు తప్పించారు.

సాక్షి ఎఫెక్ట్..



రోడ్లపై చేరిన నీటిని కాలువలు తవ్వి తొలగిస్తున్న సిబ్బంది

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

దుండిగల్: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేట్‌లోని ప్రధాన రహదారిలో రోడ్డు సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నారని స్థానికులు విన్నవించారు. వెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ అధికారులతో మాట్లాడి నిధులను మంజూరు చేయించారు. శుక్రవారం సీసీ రోడ్డును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాలనీ జనరల్ సెక్రటరీ పద్మరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్ రావు శామీర్ పెట్, జి. మల్లేష్, జి . శ్రీను, హరివర్ధన్ రావు, రేవంత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కొలన్ మనోజ్ రెడ్డి, కె రాకేష్, అంజయ్య గౌడ్, ప్రభాకర్, నవీన్, వంశీ కృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

అల్లుకున్న నిర్లక్ష్యం

రంగారెడ్డినగర్: ఓ వైపు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో అడపాదడపా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. కొన్ని చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్ స్తంభాలకు తీగలు అల్లుకొని కనిపిస్తున్నాయి. దీంతో తరచూ విద్యుత్ ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ రోడ్డు- గాంధీనగర్ రోడ్డులో ఓ విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. దీంతో సమీప ఇళ్ల వాసులకు గాలి వీచిన ప్రతిసారి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొక్కుబడిగా కాకుండా విద్యుత్ తీగలకు అల్లుకున్న తీగలకు పూర్తి స్థాయిలో తొలగించాలని పలువురు కోరుతున్నారు.



ఆలయాల్లో శ్రావణ శోభ

సుభాష్‌నగర్: శ్రావణమాసం మొదటి రోజు సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. గాజులరామారంలోని చిత్తరమ్మ దేవి ఆలయంలో భక్తిశ్రద్ధల మధ్య కుంకుమార్చనలు జరిగాయి.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు లబ్ధి



కుత్బుల్లాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని బీఆర్ఎస్ నేతలు అన్నారు. గాజులరామారం ప్రాంతానికి చెందిన మహ్మద్ అమీరుద్దీన్‌కు రూ.2.25 లక్షలు, లక్ష్మమ్మకు రూ.2 లక్షల ఎల్ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. సదరు చెక్కులను చింతల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయా డివిజన్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, మాధవ రెడ్డి, సుధాకర్, నరేందర్ రెడ్డి, సమ్మయ్య, ఎల్లా గౌడ్, నదీమ్ రాయ్, ప్రసాద్, బి.రాధ, డి.దుర్గా తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కాలనీవాసులకు సూచనలిస్తున్న డీసీ మల్లారెడ్డి

జగద్గిరిగుట్ట: వర్షాకాలంలో అంటూ వ్యాధులు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తరచుగా వర్షాకాలంలో వచ్చే మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దోమల నివారణకు తరచుగా ఫాగింగ్ చేయాలని ఎంటమాలజీ సిబ్బందికి సూచించారు. చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో జైహింద్, ఎస్ఎఫ్ఏలు, ఎంటమాలజీ సిబ్బంది, శ్రీనివాస్, విఠల్ గౌడ్, జగన్, కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజులను వాడుకున్న కళాశాల ఇన్‌చార్జి అరెస్టు

దుండిగల్: విద్యార్థుల ఫీజులను తన అకౌంట్‌లోకి మళ్లించుకున్న ఓ ప్రైవేట్ కళాశాల ఇన్‌చార్జిపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లాకు చెందిన శ్రీకాంత్ బౌరంపేట్‌లోని శ్రీచైతన్య కళాశాలలో అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఇన్‌చార్జిగా పని చేస్తున్నాడు. బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్న అతను కళాశాలలో విద్యనభ్యసిస్తున్న 40 మంది విద్యార్థులకు చెందిన రూ.13 లక్షల ఫీజులను తన సొంతానికి వాడుకున్నాడు. పెండింగ్ ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యం పేర్కొనడంతో ఈ విషయం బయటపడింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు నాలుగు రోజుల క్రితం దుండిగల్ పోలీసులను ఆశ్రయించగా.. శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేశారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించుటకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బండి రాజు శుక్రవారం తెలిపారు. బాటని, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిస్టరీ, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు, జువాలజీ పాఠ్యాంశాలను బోధించడానికి పీజీలో సంబంధిత సబ్జెక్టు లో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు 28న మధ్యాహ్నం 12గంటల లోగా సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.